# వైకల్యం గల వ్యక్తుల చట్టం 2016



# గ్రామ స్థాయి శిక్షకుల కరదీపిక

## భాగం – 2

# అధ్యాయం - 6

# ప్రామాణిక వైకల్యం కలిగిన వ్యక్తులకు ప్రత్యేక నిబంధనలు

## ప్రామాణిక వైకల్యం గల పిల్లలకు ఉచిత విద్య:

1. 18 సంవత్సరాల లోపు వయస్సు వున్న నిర్ధిష్ట వైకల్యం గల పిల్లలందరికీ, తమ సమీప పాఠశాలలో గాని, ప్రత్యేక పాఠశాలలో గాని తమ అభీష్టం మేరకు ఉచిత విద్యను పొందే హక్కు వుంది.



## ఉన్నత విద్యా సంస్థలలో రిజర్వేషన్లు:




1. ప్రామాణిక వైకల్యం గల విద్యార్థుల కోసం ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలలోనూ, ప్రభుత్వము నుండి నిధులు పొందే సంస్థలలోనూ 5% సీట్లు తప్పక కేటాయించాలి.
2. ఉన్నత విద్యా సంస్థలలో ప్రామాణిక వైకల్యం గల విద్యార్థుల ప్రవేశం కొరకు వయో పరిమితిని 5 సం॥రాలు సడలించాలి.

## రిజర్వు ఉద్యోగాల గుర్తింపు:

1. ప్రామాణిక వైకల్యం గల వ్యక్తుల ఉద్యోగాల గుర్తింపు కొరకు నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి వైకల్యాన్ని బట్టి కేటాయించిన రిజర్వు పోస్టు గుర్తించాలి. గుర్తించిన పై ఉద్యోగాలపై మూడు సంవత్సరాలకు ఒకసారి సమీక్ష జరగాలి.

**ఉద్యోగాల రిజర్వేషన్లు:**

1. సముచిత ప్రభుత్వం తమకు సంబంధించిన అన్ని సంస్థలలో అందుబాటులో వున్న మొత్తం ఉద్యోగాలలో 4% తక్కువ కాకుండా, ఉద్యోగాలను వైకల్యం గలిగిన వ్యక్తుల కోసం రిజర్వు చేయాలి.
2. దృష్టిలోపం, తక్కువ దృష్టి కలిగిన వ్యక్తులకు ఉద్యోగాలలో 1% రిజర్వేషన్.
3. వినికిడి లోపం ఉన్న వాళ్లకు ఉద్యోగాలలో 1% రిజర్వేషన్.
4. మెదడు పక్షవాతం, కుష్టువ్యాధి నయమైన వారు, మరుగుజ్జుతనం, యాసిడ్ దాడి బాధితులు, కండరాల క్షీణతతో బాధపడే వారు, చలన వైకల్యం వున్న వాళ్ల కోసం ఉద్యోగాలలో 1% రిజర్వేషన్.
5. ఆటిజం, మేథోపరమైన వైకల్యం, నేర్చుకొనే సామర్థ్యాల పరంగా వైకల్యం, మానసిక రోగం, వినికిడి లోపం, దృష్టిలోపం వంటి బహుళ వైకల్యాలు కలగలసి వున్న వాళ్లకు ఉద్యోగాలలో 1% రిజర్వేషన్.

6. కాలానుగుణంగా ప్రభుత్వం ఇచ్చే సూచనలకు అనుగుణంగా ఉద్యోగాల ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలి. అయితే ఛీఫ్ కమీషనర్ లేదా స్టేట్ కమీషనర్‌తో సంప్రదింపుల తర్వాత, జరిగే పని స్వభావం బట్టి సముచిత ప్రభుత్వం, ఏదైనా సంస్థను ఈ రిజర్వేషన్ల పరిధి నుండి మినహాయించవచ్చు.
7. ఆయా సంస్థలలో రిజర్వేషన్లకు అనువైన ఉద్యోగాల గుర్తింపునకు ప్రభుత్వం ఒక కమిటీని నియమించాలి.
8. ఈ కమిటీలో సభ్యులుగా వైకల్యంవున్న వ్యక్తులకు తగినంత ప్రాతినిధ్యం తప్పని సరిగా వుండాలి.
9. ఒక నియామాక సంవత్సరంలో అర్హులైన వైకల్యం గల వ్యక్తులు లేరని గాని లేదా మరే ఇతర కారణాలతో గానీ భర్తీ చేయకుండా ఖాళీగా వుంచిన పోస్టును, మరో నియామక సంవత్సరానికి బదిలీ చేసి జోడించాలి. ఆ పోస్టును వైకల్యం గల వ్యక్తుల కోసం కేటాయించిన 5 కేటగిరీలలోని మరే ఇతర వైకల్యం గల అభ్యర్థితోనైనా భర్తీ చేయవచ్చు. ఆ పోస్టుకు వైకల్యం గల వ్యక్తి ఏ మాత్రం అందుబాటులో లేని సందర్భంలో మాత్రమే, ఆ పోస్టును వైకల్యం లేని వ్యక్తితో భర్తీ చేయవచ్చును.

## ప్రైవేటు సంస్థలకు ప్రోత్సాహకాలు:

1. ప్రైవేటు సంస్థల్లో మొత్తం ఉద్యోగుల్లో కనీసం 5% ఉద్యోగులు వైకల్యం గల వ్యక్తులు ఉంటే, ఆ సంస్థల యాజమాన్యాలకు తగిన ప్రోత్సాహక రాయితీని అందించవచ్చు.



**ప్రత్యేక పథకాలు:**

**అభివృద్ధి కార్యక్రమాలు:**

1. వ్యవసాయ భూములు, గృహ వసతి కేటాయింపుల పరంగా వైకల్యంగల వ్యక్తుల కొరకు 5% రిజర్వేషన్లు అమలు పరచాలి.
2. పేదరిక నిర్మూలన పథకాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలలో ప్రయోజనాలు అందించే విధంగా వైకల్యం గల మహిళలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి.
3. హౌసింగ్, వసతి, వ్యాపారం లేదా ఏదైన సంస్థ ఏర్పాటు, రిక్రియేషన్ సెంటర్ లేదా ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు కోసం రాయితీతో కూడిన భూమి కేటాయింపులో వైకల్యం గల వ్యక్తులకు 5% రిజర్వేషన్ అమలు చేయాలి.

# అధ్యాయం - 7

## అధిక మద్దతు అవసరమున్న వైకల్యం గల వ్యక్తులకు ప్రత్యేక రాయితీలు:

1. అధిక మద్దతు అవసరముందని భావించే నిర్దిష్ట వైకల్యంగల వ్యక్తులు గాని, వారి పక్షాన ఎవరైన వ్యక్తి లేదా సంస్థ గాని సంబంధిత ప్రభుత్వాధికారికి మద్దతు కోసం దరఖాస్తు చేయవచ్చును.
2. సంబంధిత అధికారి ఆ దరఖాస్తును బోర్డు ద్వారా పరిశీలించి తగిన సాయం అందిస్తారు.



# అధ్యాయం - 8

## సంబంధిత / తగిన ప్రభుత్వాల విధులు, బాధ్యతలు

**అవగాహనా ప్రచారం:**

1. చట్టపరమైన హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం సదస్సులు, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి.
2. వైకల్యం గల వ్యక్తుల పట్ల స్వీకారం, గౌరవం చూపి, వారి నైపుణ్యాలు, విశిష్టతలు, సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి. తమ కుటుంబ జీవితం, బంధుత్వాలు, పిల్లలను కనడం పోషించడం వంటి విషయాలలో వారి నిర్ణయాల పట్ల గౌరవాన్ని పెంచాలి.



3. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాలు, వృత్తిపర శిక్షణా సంస్థల్లోని పాఠ్యాంశాలలో వికలాంగుల హక్కుల అంశాలను చేర్చాలి. వైకల్యం గల వ్యక్తుల హక్కుల పట్ల సరైన ధోరణి, అవగాహన కల్గించాలి.
4. వైకల్యం గల వారి పరిస్థితులపై, హక్కులపై సంబంధిత యజమానులు, అధికారులు, తోటి ఉద్యోగస్తులలో సరైన అవగాహన కల్పించాలి.



**అందుబాటు:**

1. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో భౌతిక వాతావరణం, రవాణా వ్యవస్థ, సమాచార వ్యవస్థ, భావ వ్యక్తీకరణలో సాంకేతిక పరిజ్ఞానం ఉన్నత ప్రమాణాలతో అందుబాటులో వుండే విధంగా ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలను జారీ చేయాలి.



## రవాణాలో సౌకర్యవంతం:

1. వైకల్యం గల వ్యక్తులకు నిర్దేశించిన ప్రమాణాల మేరకు బస్టాపులు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు వంటి ప్రదేశాలలో తగిన సౌకర్యాలు కల్పించాలని ఈ చట్టం నిర్దేశిస్తుంది. అదే రీతిలో పార్కింగ్ స్థలాలు, టాయిలెట్‌లు, టికెట్ కౌంటర్లు, టికెట్ మెషీన్ల దగ్గర కూడా వైకల్యం గల వ్యక్తుల సౌకర్యం మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి.



2. అన్ని రకాల రవాణా సౌకర్యాల కూడా సార్వత్రిక నమూనా (డిజైన్) ప్రమాణాల పరిధిలో ఉండాలి. సాంకేతికంగా సాధ్యమైన చోట్ల, ఆర్థికంగా అనువైన చోట్ల వైకల్యం గల వ్యక్తులకు సురక్షితంగా వుండే రీతిలో రవాణా పద్ధతులలో తగిన మార్పులు చేపట్టాలి. వైకల్యం కలిగిన వ్యక్తులు వీలైన స్థాయిలలో తక్కువ ఖర్చుతో వ్యక్తిగత రవాణా ఎంచుకొనే రీతిలో తగిన ప్రోత్సాహకాలు, రాయితీలు కల్పించేలా సంబంధిత ప్రభుత్వం అనువైన పథకాలు అమలు చేయాలి.



**సమాచార భావ వ్యక్తీకరణ**

**పరిజ్ఞానపు అందుబాటు:**

1. వైకల్యం గల వ్యక్తులకు శ్రవణ, ముద్రణ, ఎలక్ట్రానిక్ మీడియా సాధనాలు అనువైన రీతిలో, అందుబాటులో ఉండేలా సంబంధిత ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి. అలాంటి వ్యక్తులకు ఎలక్ట్రానిక్ ప్రసార సాధనాల సాంకేతికతతో పాటు, వారు ఉపయోగించే సాంకేతిక భాషకు అన్వయించే సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలి.










**నిత్యావసర వస్తువులు:**

1. వైకల్యం గల వ్యక్తులు సామాన్యంగా ఉపయోగించే వినిమయ వస్తువులు, వాటి అనుబంధ సామగ్రిలో సార్వత్రిక నిర్మాణం వుండేటట్లు ఉత్పత్తి చేసి, పంపిణీ చేసి, అభివృద్ధి చేసే విధంగా సంబంధిత ప్రభుత్వము చర్యలు చేపట్టాలి.

**అందుబాటు నియమాలు**

**తప్పనిసరి:**

1. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నిబంధనలకు అనుగుణంగా ఏ భవన నిర్మాణ ప్రణాళికా లేని ఎడల ఆ నిర్మాణానికి ఏ సంస్థకూ అనుమతి ఇవ్వబడదు.

**ఉన్న భవనాల ఆవరణ సముదాయాలలో అందుబాటుకు అనుగుణ మార్పులకు కాల పరిమితి:**

1. కేంద్ర ప్రభుత్వం రూపొందించే నియమాల మేరకు, ఆ నియమాలు అమల్లోకి వచ్చిన తేదీ నుండి ఐదేళ్లు గడువు లోపల అన్ని రకాల ప్రభుత్వ భవనాలలోను, వైకల్యం గల వ్యక్తులకు అందుబాటులో వుండే రీతిలో అనువైన అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చాలి. నిర్దేశించిన ఈ ఐదేళ్ళ కాల పరిమితిని పరిస్థితిని బట్టి ఆయా రాష్ట్రాల కోసం పొడిగించవచ్చు.

**సామాజిక తనిఖీ:**

1. వైకల్యం గల వ్యక్తుల పథకాలు, వారి అవసరాలకు అనుగుణంగా వున్నవా! లేదా అని నిగ్గ తేల్చేందుకు సామాజిక తనిఖీ ద్వారా తగిన చర్యలు చేపట్టాలి.



## అధ్యాయం – 9

## వైకల్యం గల వ్యక్తుల కోసం పని చేసే సంస్థల రిజిస్ట్రేషన్, ఆ సంస్థలకు నిధులు:

### సమర్థ అధికారి:

- వైకల్యం గల వ్యక్తుల కోసం పని చేసే సంస్థల రిజిస్ట్రేషన్ కొరకు ప్రభుత్వం సమర్థత గల అధికారిని నియమించాలి.

### రిజిస్ట్రేషన్:

- సమర్థత గల అధికారిచే రిజిస్ట్రేషన్ ధృవ పత్రం లేకుండా వైకల్యం గల వ్యక్తుల కోసం సంస్థలు స్థాపించడం కానీ, నడపడం కానీ చేయరాదు.



## రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కోసం:

- రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ కోసం సమర్థ అధికారికి దరఖాస్తు చేసుకొనే వారు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన పద్ధతిని అనుసరించి అర్జీ దాఖలు చేయాలి.


GOVERNMENT OF TRIPURA
OFFICE OF THE REGISTRAR OF SOCIETIES
CERTIFICATE OF REGISTRATION

## రిజిస్ట్రేషన్ రద్దు – అప్పీలు:

- రిజిస్ట్రేషన్ రద్దు మరియు అప్పీలు చేసుకొనే విధి విధానాలు ఈ చట్టంలోని సెక్షన్ 52, 53లలో పొందుపరచబడినవి.

**రిజిస్ట్రేషన్ సంస్థలకు ఆర్థిక సహాయం:**

- ఈ చట్టంలో నిర్దేశించిన విషయాల ప్రకారం సంబంధిత ప్రభుత్వం తమ ఆర్థిక స్తోమతకు, అభివృద్ధికి అనుగుణంగా పథకాలు, కార్యక్రమాల అమలుకు, సేవలకు గాను రిజిస్ట్రేషన్ పొందిన సంస్థలకు ఆర్థిక సహాయం అందిస్తుంది.

## అధ్యాయం – 10

## నిర్దిష్ట వైకల్యాల ధృవీకరణ:

**నిర్దిష్ట వైకల్యాలను నిర్దేశించడానికి మార్గదర్శకాలు:**

- ఒక వ్యక్తి ఏ మేరకు నిర్దిష్ట వైకల్యం కలిగి ఉన్నాడనేది పరిశీలించి నిర్ధారించడానికి అవసరమైన మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించి ప్రకటన చేయాలి. వ్యక్తులకు గల వైకల్యాన్ని పరిశీలించి, ఆ మేరకు ధృవీకరణ పత్రాలను ఇవ్వడానికి గాను సంబంధిత ప్రభుత్వం నిర్దిష్ట అర్హతలు కలిగిన వ్యక్తులను సంబంధిత అధికారులుగా నియమించాలి. ఇలా ధృవీకరణ పత్రాలు జారీ చేసే సంబంధిత అధికారుల అధికార పరిధిని కూడా సంబంధిత ప్రభుత్వం ప్రకటించాలి.

**సర్టిఫికేట్ మంజూరు చేసే అధికారి నియామకం, మరియు సర్టిఫికేట్ జారీ చేసే ప్రక్రియ:**

- నిర్దిష్ట వైకల్యం గల వ్యక్తులు తమ వైకల్యానికి సంబంధించి ధృవీకరణ పత్రం పొందడానికి గాను, నిర్దేశించిన ఫారంలో సంబంధిత అధికారికి ధరఖాస్తు చేసుకోవాలి. ఈ అధికారులు జారీ చేసిన వైకల్య ధృవీకరణ పత్రం దేశమంతటా చెల్లుబాటు అవుతుంది.

**నోట్: ప్రామాణిక వైకల్యం కలిగిన వ్యక్తి అనే నిర్వచన పరిధిలో నిర్దేశించిన మేరకు ఒక వ్యక్తి వైకల్యం 40% లేదా అంతకు మించి ఉండాలి. ఇలా 40% లేదా అంతకు మించి వైకల్యం కలిగి వుండి, ఆ మేరకు సంబంధిత అధికారి ద్వారా ధృవీకరణ పత్రం పొందిన వైకల్యం కలిగిన వ్యక్తులకు మాత్రమే ఈ చట్టంలో పొందుపరచిన హక్కులు, ప్రయోజనాలు దక్కుతాయి.**

**సర్టిఫికేట్ జారీ చేసే అధికారి నిర్ణయానికి వ్యతిరేకంగా అప్పీలు:**

- సర్టిఫికేట్ జారీ చేసే అధికారి నిర్ణయాన్ని వ్యతిరేకించిన పక్షంలో బాధిత వ్యక్తులు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపల మరియు విధానంలో రాష్ట్ర ప్రభుత్వంచే నిర్ణయించబడిన పునర్విచారణ (అప్పిలేట్) అధికారికి అప్పీలు చేసుకోవచ్చును.

# అధ్యాయం - 11

# వైకల్యంపై కేంద్ర, రాష్ట్ర సలహా బోర్డులు మరియు జిల్లా స్థాయి కమిటీలు:

## వైకల్యంపై కేంద్ర సలహా బోర్డు వ్యవస్థీకరణ:

- కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా చట్టంలో తెలిపిన విధుల నిర్వహణకు, కేంద్ర స్థాయిలో సంబంధిత కేంద్ర మంత్రి అధ్యక్షతన సంబంధిత మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, జాతీయ కేంద్రాల నిర్వాహకులు, లోక్‌సభ నుండి ఇద్దరు, రాజ్యసభ నుండి ఒకరు మొత్తం ముగ్గురు పార్లమెంట్ సభ్యులు, రాష్ట్రాలకు చెందిన మంత్రులు, వైకల్యం గల వ్యక్తుల సంస్థలతో సంబంధం వున్న సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలి.



**వైకల్యంపై రాష్ట్ర సలహా బోర్డు:**

- రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనల ద్వారా సంబంధిత మంత్రి అధ్యక్షతన సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, శాసనసభ నుండి ఇద్దరు, శాసన మండలి నుండి ఒక్కరు, వైకల్యం గల వ్యక్తులతో పనిచేసే సంస్థలు, సంఘాల సభ్యులతో రాష్ట్ర సలహా బోర్డు ఏర్పాటు చేయాలి.

**వైకల్యంపై జిల్లా కమిటీ:**

- రాష్ట్ర ప్రభుత్వం తాను నిర్దేశించిన విధులను నిర్వర్తించడానికి, వైకల్యంపై జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తుంది.

# అధ్యాయం - 12

## వైకల్యం గల వ్యక్తుల కోసం చీఫ్ కమీషనర్ మరియు స్టేట్ కమీషనర్ :

### చీఫ్ కమీషనర్ నియామకం:



- ఈ చట్టం పరిధిలో వైకల్యం కలిగిన వ్యక్తులకోసం కేంద్రప్రభుత్వం ఒక చీఫ్ కమీషనర్‌ను నియమించాలి. చీఫ్ కమీషనర్‌కు సహకరించడానికి తనకు తోడుగా మరో ఇద్దరు కమీషనర్‌లను కూడా నియమించాలి. ఇందులో ఒకరు వైకల్యం గల వ్యక్తి అయి ఉండాలి. చీఫ్ కమీషనర్ లేదా కమీషనర్‌లుగా నియమించబడే వ్యక్తులకు వికలాంగుల పునరావాసానికి సంబంధించి తగిన ప్రత్యేక పరిజ్ఞానం, ప్రాక్టికల్ అనుభవం ఉండాలి. చీఫ్ కమీషనర్ విభిన్న వైకల్య విభాగాలకు చెందిన11మంది నిపుణులైన సభ్యులతో, కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో ఒక సలహా సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

**ప్రధాన కమీషనర్ విధులు:**

1. ఈ చట్టంలోని ఏ అంశానికైనా అనుగుణంగా లేని రీతిలో ఉన్న చట్టాలు, కార్యక్రమాలు, ప్రక్రియలు, విధివిధానాలు, స్వయంగా కాని, ఇతరత్రా గాని గుర్తించి వాటిని సరిదిద్దడానికి అవసరమైన చర్యలు చేపట్టాలి.
2. చట్టపర హక్కులకు, చట్టబద్ధ ప్రయోజనాలకు ఎక్కడైనా, ఏ రీతిలోనైనా భంగం కలిగిన యెడల, వెంటనే చర్యలు తీసుకోవాలి.
3. ఈ చట్టపు మరియు ఇతర చట్టాల ప్రయోజనాలను, అమలు తీరును సమీక్షించి, సమర్థవంతంగా హక్కుల అమలుకు కృషి చేయాలి.
4. వికలాంగులు హక్కులు పొందే దశలో ఎదుర్కొంటున్న అవరోధాలను సమీక్షించి పరిష్కార మార్గాలను సూచించాలి.

5. అంతర్జాతీయ ఒడంబడికలను, ఒప్పందాలను పరిశీలించి, పరిశోధించి, వాటి సమర్థ అమలుకు సూచనలు, సిఫారసులు చేయాలి.
6. వికలాంగుల హక్కుల అంశాలపై విస్తృత స్థాయి పరిశోధనలు ప్రోత్సహిస్తూ, వారి హక్కుల పరిరక్షణకై తగు చర్యలు చేపట్టాలి.
7. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వినియోగాన్ని పర్యవేక్షిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన ఇతర విధులను నిర్వర్తించాలి.
8. చట్టం ప్రకారం చీఫ్ కమీషనర్‌కు సివిల్ కోర్టు తరహా అధికారాలు ఉంటాయి.

**రాష్ట్ర కమీషనర్ నియామకం మరియు విధులు:**

1. రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర స్థాయిలో "స్టేట్ కమీషనర్"ను నియమించాలి. కేంద్ర స్థాయిలో చీఫ్ కమీషనర్ ఏ పాత్ర, బాధ్యతలను అయితే నిర్వర్తిస్తాడో, అదే పాత్ర బాధ్యతలను రాష్ట్ర స్థాయిలో స్టేట్ కమీషనర్‌కు అప్పగించాలి. స్టేట్ కమీషనర్‌కు సహాయం చేయడానికి గాను, ఐదుగురి కంటే ఎక్కువ కాకుండా సభ్యులతో ఒక సలహా సంఘాన్ని ఏర్పాటు చేయాలి. రాష్ట్రం నిర్దేశించిన రీతిలో వైకల్యం, పునరావాసం అంశాలపై విషయనిపుణత కలిగివున్నవారిని ఈ సలహా సంఘంలో సభ్యులుగా నియమించాలి. రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఇతర విధులను కూడా ఈ కమీషనర్ నిర్వర్తిస్తాడు.

**రాష్ట్ర కమీషనర్ అధికారాలు:**

1. రాష్ట్ర కమీషనర్‌కు తన విధులను అమలు పరిచేందుకు సివిల్ కోర్టు తరహా అధికారాలు వుంటాడయి.
2. సాక్షులకు సమన్లు జారీ చేసి పిలిపించుకొనేందుకు, అవసరం అయిన డాక్యుమెంట్లు తెప్పించుటకు, కోర్టు కార్యాలయం నుండి అవసరమైన రికార్డులు, ప్రతులను తెప్పించుకొనుటకు, సాక్ష్యుల డాక్యుమెంట్లు పరిశీలించేందుకు కమీషన్ వేయడానికీ, వార్షిక నివేదికలు తయారు చేసి చట్టసభలకు నివేదించడానికీ, వికలాంగుల హక్కులను కాపాడుటలో స్వతహాగా తగిన చర్యలు తీసుకొనేందుకు ఈ కమీషనర్‌కు అధికారం వుంటుంది.

# అధ్యాయం - 13
# ప్రత్యేక కోర్టులు

## ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్:

ఈ చట్టంలో తెలిపిన నేరాల సత్వర విచారణ జరిపే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన పిదప, ప్రతి జిల్లాలోను ఒక సెషన్స్ కోర్టును ప్రత్యేక కోర్టుగా నిర్ధారించాలి. ఈ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను లేదా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదిని వైకల్యం గల వ్యక్తుల కేసులను వాదించడానికి నియమించాలి.



## అధ్యాయం - 14

## వైకల్యం కలిగిన వ్యక్తుల కోసం జాతీయ నిధి :

- వైకల్యం కలిగిన వ్యక్తుల కోసం జాతీయ స్థాయిలో జాతీయ నిధి పేరిట ఒక నిధిని ఏర్పాటు చేయాలి.



## అధ్యాయం - 15

## వైకల్యం కలిగిన వ్యక్తుల కోసం రాష్ట్ర నిధి :

- వైకల్యం కలిగిన వ్యక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర నిధిని ఏర్పాటు చేయాలి.

## అధ్యాయం - 16

## చట్టం నిర్దేశించిన నిబంధనల ఉల్లంఘనకు శిక్ష :

ఈ చట్టంలో పొందుపరచిన అంశాలు లేదా తెలిపిన నియమాలలో ఏదేని అంశాన్ని లేదా నియమాన్ని ఏ వ్యక్తి అయినా ఉల్లంఘిస్తే, తొలిసారి అలాంటి నేరానికి రూ॥ **10,000/- వరకు జరిమానా విధించాలి. అదే నేరం పునరావృతం చేసిన వ్యక్తికి రూ॥50,000/- తక్కువ కాకుండా రూ॥ 5,00,000/-ల వరకు జరిమానా విధించాలి.**



**కంపెనీ నేరాలు:**

ఈ చట్టం ప్రకారం కంపెనీ లేదా కార్పొరేట్ సంస్థ నేరం చేసినట్లు ఋజువు అయితే న్యాయపరమైన చర్యలు ఎదుర్కొని శిక్షకు గురౌతారు.

**సెక్షన్ 91:**

- కనీస వైకల్యం గల వ్యక్తులకు చెందవలసిన ఏ లబ్ధినైనా, ఎవరైనా మోసపూరితంగా పొందడం లేదా పొందడానికి ప్రయత్నించడం చేస్తే రెండు సంవత్సరాల జైలు శిక్ష లేదా లక్ష వరకు జరిమానా లేదా రెండూ కలిసిన శిక్షకు పాత్రులవుతారు.

**సెక్షన్ 91 – అణచివేతకు, నేరాలకు శిక్ష:**

- ఎవరైనా

ఎ) వైకల్యం గల ఏ వ్యక్తినైనా కించపరిచే ఉద్దేశ్యంతో ఏ స్థలంలోనైనా, బహిరంగంగానైనా ఉద్దేశ్యపూర్వకంగా అవమానించినా, భయపెట్టినా ;

బి) వైకల్యం గల ఏ వ్యక్తినైనా అగౌరవపరిచే ఉద్దేశ్యంతో దాడి లేదా బలప్రయోగం చేయడం లేదా వైకల్యం గల మహిళ మాన మర్యాదలను భంగ పరచినా;

సి) వైకల్యం కలిగిన ఏ వ్యక్తిపైన పెత్తనం చేయడం లేదా అణిచివేయడం, ఆవ్యక్తికి ఉద్దేశ్యపూర్వకంగా ఆహారాన్ని లేదా పానీయాలను ఇవ్వడానికి నిరాకరించడం చేసినా,

డి) వైకల్యం గల మహిళ లేదా బాలలపై పెత్తనం చెలాయిస్తూ తన ఆధిపత్యాన్ని వినియోగించి, ఆ వ్యక్తిపై లైంగిక దాడి చేయడం లేదా లైంగికంగా వాడుకోవడం చేసినా,

ఇ) వైకల్యం గల  ఏ వ్యక్తినైనా ఉద్దేశపూర్వకంగా గాయపరచడం, ఆ వ్యక్తి యొక్క అవయవం లేదా శరీర భాగాలపై దాడి చేసి వాటికి హాని కలిగించడం, అలాగే ఆ వ్యక్తికి ఊతమిచ్చే ఏ పరికరాన్ని అయినా ధ్వంసం చేయడం చేసినా,

ఎఫ్)వైకల్యం గల మహిళలకు తీవ్ర వైకల్యం కారణంగా గుర్తింపు పొందిన వైద్యుని అభిప్రాయంలోను, ఆమె సంరక్షకుని అనుమతితో మినహా, ఆమె అనుమతి లేకుండా గర్భం తొలగించే వైద్య కార్యక్రమాలను చేసినా, నిర్వహించినా, చేయమని అడిగినా, వారు శిక్షార్హులు. వారికి కనీసం 6 నెలల నుండి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష జరిమానాతో పాటు విధించబడుతుంది.

**సమాచారం ఇవ్వడంలో వైఫల్యానికి శిక్ష:**

- చట్టానికి సంబంధించిన పుస్తకాలు, ఖాతాలు, డాక్యుమెంట్లు, ప్రకటనలు, వివరాలు ఇవ్వడంలో విఫలమైతే సంబంధితులు 25 వేల రూపాయలకు శిక్షార్హులు. రెండవ సారి కొనసాగితే ప్రతి రోజు వెయ్యి రూ॥లు అదనపు జరిమానా విధించబడును.

**ఇతరములు:**

- 100వ సెక్షన్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం నియమనిబంధనలను జారీ చేస్తుంది.
- 101వ సెక్షన్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అధికారాలు;
    - పరిశోధన కమిటీ, సంరక్షకుల నియామకం, సంస్థల రిజిస్ట్రేషన్, రాష్ట్ర, జిల్లా కమిటీల ఏర్పాటు, రాష్ట్ర కమీషన్ నియామకం, కమీషనర్ సలహా సంఘం ఏర్పాటు, జిల్లా కోర్టుల, అడ్వకేట్‌ల నియామకం, రాష్ట్ర నిధి ఏర్పాటు తదితర అంశాలపై నియమనిబంధనల ఏర్పాటుకు తగిన అధికారాలున్నాయి.
- 102వ సెక్షన్ ప్రకారం, గత 1995 చట్టం రద్దైనా కానీ, ఆ చట్టం ప్రకారం జారీ చేయబడిన ఆదేశాలన్నీ కూడా అమలులో ఉంటాయని 2016 వికలాంగుల హక్కుల చట్టం తెలిపింది.



# ధన్యవాదములతో......

మీ సలహాలు, సూచనలు ఇవ్వగలరని ఆశిస్తూ.....



## తెలుగు రాష్ట్రాల

## వికలాంగుల హక్కుల చట్టం అమలు కోర్ కమిటీ

